క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయంగా ఏం వినియోగించాలో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యాశాఖాధికారులు సురేక, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

సింగరాయకొండ: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా సోదరభావంతో కలిసి మెలిసి ఈ పండుగను జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం నిర్వహించిన వేలంలో ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. స్థానిక పొగాకు వేలంకేంద్రంలో నిర్వహించిన వేలంలో జువ్విగుంట, అయ్యవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 190 బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. అందులో 160 బేళ్లు కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 30 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.270, సరాసరి ధర రూ.277.37 పలికింది. వేలంలో 10 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ నర్నే శ్రీనివాసరావు వీటిని అందించారని హెచ్ఎం వాకా వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయులు డి. శ్రీధర్, సురేష్, చెన్నయ్య, సుబ్బారావు, వెంకట్రావు, జ్యోతి, విజయలక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో సీఎస్‌పురంకు చెందిన దాత పఠాన్ ఖాజారంతుల్లా తన సొంత నిధులతో పరీక్ష ప్యాడ్, పెన్నులు, జామెంట్రీ, పెన్సిళ్లు మొదలైన సామగ్రిని సమకూర్చి హెచ్ఎం చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

నాణ్యమైన కందులకు మంచి ధర

కొండపి: మేలైన వ్యవసాయ సాగు పద్ధతిలో పండించే కందులకు మంచి ధర లభిస్తుందని వ్యవసాయాధికారి డి.విజయకుమార్ అన్నారు. మండలంలోని పెట్లూరులో గురువారం పొలంబడి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే చోట 30 మంది రైతులు సాగు చేస్తున్న కంది పంటలో ఐదుగురి వద్ద నుంచి పంట కోత కోసే సమయంలో దగ్గరుండి పర్యవేక్షించి ఐదుగురు రైతుల నుంచి కిలో విత్తనాలు సేకరించి పరీక్ష కేంద్రానికి పంపిస్తామని తెలిపారు.సేకరించిన విత్తనాల్లో రసాయనిక అవశేషాలు తక్కువ మొత్తంలో కలిగిన వాటికి పొలంబడి రైతులకు ప్రత్యేక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఐ.పద్మ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆదరణ-3పై అవగాహన సదస్సు

గుడ్లూరు: ఆదరణ-3 పథకంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కుల వృత్తుల సంఘాల నాయకులతో అధికారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మండలంలోని బీసీ కార్పొరేషన సహకారంతో అన్ని కుల సంఘాల నాయకులను సమావేశానికి ఆహ్వానించారు. కుల సంఘాల నాయకులు సూచనలను సలహాలు ఇవ్వాలని ఎంపీడీఓ కోరారు. వాటిని ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు. త్వరలోనే ఆదరణ పథకం కింద దరఖాస్తులు కూడా స్వీకరించేందుకు తేదీలు నిర్ణయించే అవకాశం ఉందని, మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు ఈ విషయాన్ని గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని కోరారు.

కుట్టు మిషన్లు అందజేత

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): మండలంలోని వెలిగండ్ల, పందువ నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దాత, విశ్రాంత మైనింగ్ డీడీ పగడాల వెంకటేశ్వరరెడ్డి రూ.50 వేలు విలువ చేసే కుట్టు మిషన్లను గురువారం విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు దాసు ప్రసాద్, హెచ్ఎంలు రాఘవచారి, హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నివారించాలి

కనిగిరిరూరల్: పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ పవన్ కళ్యాణ్ అన్నారు. స్థానిక ఎంఈఓకు యువీ నారాయణరెడ్డికి గురువారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌ను ఆడుకుంటున్నారని ఆరోపించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని అందచేశారు.

గింజ కొంటే..ఒట్టు!


మోపాడులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం


ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నిల్
- విక్రయానికి ముందుకు రాని రైతులు
- పొలాల్లో దళారులకే అమ్ముకుంటున్న వైనం
- నియోజకవర్గంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కందుకూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఒక్క గింజ ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం విధించిన అడ్డగోలు నిబంధనలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ముందుకు రావడం లేదు. అదే సమయంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు ఇష్టపడని రైతులు.. పొలాల్లోనే దళారులకు విక్రయించేస్తున్నారు. కందుకూరు మండలంలో మొత్తం 665 హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికొచ్చి నూర్పిళ్లు జరుగుతున్నాయి. మోపాడు, పలుకూరు, మహదేవపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో తమ పంటను అమ్ముకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునే రైతులకు పలు నిబంధనలు పెట్టారు. వీటిలో ప్రధానంగా ధాన్యం పరిశుభ్రంగా ఉండటంతో పాటు తేమ 17 శాతానికి మించి ఉండరాదు. ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని క్వింటా రూ.2,320, తర్వాత గ్రేడ్‌లు రూ.2,300లు ధర చెల్లిస్తున్నారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారాయి. అమ్ముకోవాలంటే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వరకు తీసుకురావాల్సిన పరిస్థితి ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు ముందుకు రావడం లేదు. అదే సమయంలో బయట మార్కెట్‌లో దళారులు నేరుగా పొలం వద్దకే వచ్చి తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులు దళారుల వద్దే విక్రయిస్తున్నారు. అదే ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.200 నుంచి రూ.300ల వరకు అధిక ధర ఇస్తున్నారని రైతులు చెప్తున్నారు.

ఇతర మండలాల్లోనూ అంతే

ఉలవపాడు మండలం ఉలవపాడు, చాగొల్లు పీఏసీఎస్‌లు, గుడ్లూరు మండలం గుడ్లూరు, దారకానిపాడు పీఏసీఎస్ కేంద్రాలు, లింగసముద్రం మండలం మొగిలిచర్ల, తూనుగుంట, చినపవని పీఏసీఎస్ కేంద్రాలు, వలేటివారిపాలెం పోకూరు, వలేటివారిపాలెం పీఏసీఎస్‌ల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంతవరకు ఆయా పీఏసీఎస్‌ల పరిధిలో ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదు. పేరుకు మాత్రమే ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఇలా నియోజకవర్గంలో మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఏ ఒక్క కేంద్రం కూడా మనుగడలో లేదు. క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించినా రైతుల నుంచి ఒక్క గింజ ధాన్యాన్ని కూడా ఇప్పటి వరకు అధికారులు కొనుగోలు చేయలేదు. ప్రధానంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ముందుకు రావడం లేదని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనల వల్లే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు ఇష్టపడటం లేదని రైతుల వాదనగా ఉంది.

లేగదూడల సంరక్షణ ఎంతో ముఖ్యం


లేగ దూడలను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి శ్రీనివాసరావు, జేడీ బేబీరాణి

టంగుటూరు: లేగదూడల సంరక్షణతో పాడి రైతులకు లాభదాయకమని రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరరావు అన్నారు. మండలంలోని మర్లపాడులో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం దేశీయ లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగ దూడల సంరక్షణతోనే పాడి లాభదాయకమని పేర్కొన్నారు. మంచి పాలసార, జాతి లక్షణాలు కలిగిన పాడి పశువుకు పుట్టిన దూడలను తదుపరి పాడిపశువుగా రైతులు తమ క్షేత్రాల్లోనే తయారు చేసుకోవాలని కోరారు. దూడల ఆరోగ్య నిర్వహణకు రైతులు శాస్త్రీయ పద్ధతులు, సరైన పౌష్టికాహారం, పశు వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి వ్యాధి నిరోధక టీకాలతో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీ రాణి మాట్లాడుతూ పెయ్య దూడలు పుట్టే లింగ నిర్ధారిత వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించి, మేలైన యాజమాన్య పద్ధతులతో ఏడాదికి ఒక దూడ పొందాలన్నారు. ఈ ప్రదర్శనలో 70 దూడలు పాల్గొనగా, మేలుజాతి దూడలకు బహుమతులు, లివర్ టానిక్, మినరల్ మిక్చర్, బలవర్ధక మందులు పంపిణీ చేశారు. పునరుత్పత్తి సమస్యలున్న 65 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, చూడి పరీక్షలు నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సీహెచ్ చంద్రశేఖరరావు, ఒంగోలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, టంగుటూరు సహాయ సంచాలకులు డాక్టర్ సుధీర్‌బాబు, కొణిజేడు పశువైద్య అధికారి డాక్టర్ సోమశేఖర్, పశువైద్య అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డి, అనిల్, పశువైద్య సిబ్బంది శివ, కిషోర్, గోపి, సుబ్బారావు, వనజ, ఫార్మా కంపెనీ ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి


మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, శాలివాహన, బీసీ సంఘాల నాయకులు

కందుకూరు: కందుకూరు శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి మొల్ల జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి శాలివాహన సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అద్దంకి సుబ్బారావు మాట్లాడుతూ వెనుకబడిన కులంలో జన్మించి మొట్టమొదటిసారిగా సంస్కృత రామాయణాన్ని తెలుగులోకి అనువధించిన ఘనత మొల్లకు దక్కుతోందన్నారు. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో రామాయణాన్ని అనువదిస్తానని ముందుకు వచ్చి పూర్తి చేశారని, మొల్ల సాహిత్యాన్ని ఎంత పొగడినా తక్కువేనన్నారు. కుమ్మర శాలివాహనులకు ఘనమైన చరిత్ర ఉందని, ఉగాది పండగ సందర్భంగా తెలుగు సంవత్సర క్యాలెండర్ ఏర్పాటు శాలివాహన శకంతోనే ప్రారంభమవుతుందన్నారు. శాలివాహన యువత ముందుకొచ్చి చరిత్రను ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలని, ఈ చరిత్రను గుర్తించే దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ట్యాంక్ బండ్‌పై మొల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించారని గుర్తు చేశారు. శాలివాహన సంఘ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలికివాయి కృష్ణ, అద్దంకి మాల్యాద్రి, ప్రముఖ డాక్టర్ ఉప్పుటూరి వెంకయ్య, సీహెచ్ మాల్యాద్రి, ఆముదాలపల్లి మాల్యాద్రి, ఉపాధ్యాయులు రమణయ్య, ఉప్పుటూరి మాధవరావు పాల్గొన్నారు.


మొల్లకు నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘ నాయకులు

ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు

కనిగిరిరూరల్: గొప్ప మహిళా కవయిత్రి మొల్లమాంబ అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఎంజీఆర్ కళ్యాణ మండపంలో శాలివాహన సంఘ అధ్యక్షుడు కూరపాటి ఓబులేసు అధ్యక్షతన మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మొల్లమాంబ విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ స్థలాన్ని కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు కూరపాటి ఓబులేసు, పట్నం నరసింహులు, అంకమ్మరావు, గోట్టం అంజి కుమార్, చీమలదిన్నె మాధవ, అబ్బూరి రామయ్య, డి.మహాలక్ష్మమ్మ, చిరంతజీవి, బీసీ నాయకులు పల్లా మాలకొండయ్య, నాయబ్‌రసూల్, ఈర్లవిజయరామరాజు, చెరుకూరి చిన కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు అండగా తెలుగుతమ్ముళ్లు


పంచాయతీ ఆవరణలో నిల్వ ఉన్న పాతసామాను


కందుకూరు రోడ్డులో ఇటీవల చెట్లు నరివేస్తున్న దృశ్యం

- ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత
- నిబంధనలకు విరుద్ధంగా పాతసామాను విక్రయానికి ప్రయత్నం

సింగరాయకొండ: 'మనోడే... చెట్లు కొట్టుకుంటాడు...అవసరమైతే పంచాయతీలోని పాతసామాను అమ్ముకుంటాడు.....అంతమాత్రం కేసులు పెడతారా ఒకవేళ పెడితే పోలీసులు కేసు నమోదు చేస్తారా..'అంటూ తెలుగుతమ్ముళ్లు అక్రమార్కులకు అండగా నిలవటంతో గత కొద్దిరోజులుగా సింగరాయకొండ పంచాయతీలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లు నరకటం, పంచాయతీ అధికారులకు తెలీకుండా పంచాయతీకి చెందిన పాతసామాను అమ్ముకోవటం పరిపాటిగా మారింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలో ఇటీవల కాలంలో మెయిన్‌రోడ్డు, కందుకూరు రోడ్డులో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్నాయంటూ తమ్ముళ్ల అండతో అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా చాలా ఏళ్ల నాటి వేపచెట్లను కొట్టి విక్రయిస్తున్నారు. వాస్తవానికి చెట్లు కొట్టాలంటే అటవీ శాఖాధికారుల అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. వారి అనుమతి లేకుండా చెట్లు కొడితే క్రిమినల్‌కేసులు నమోదు చేస్తారు. కానీ ఈ పంచాయతీలో ఇవేమీ జరగవు. గత శనివారం సెలవురోజు పంచాయతీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తున్న తన్నీరు శివ నాగరాజు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ, పంచాయతీ కార్యాలయంపై భద్రపరచిన పాత ఇనుము, అల్యూమినియం సామగ్రిని అధికారులకు తెలీకుండా అమ్ముకునే ప్రయత్నం చేశాడు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలకు పైగా ఉంటుంది. విషయం తెలిసి పంచాయతీ కార్యదర్శి జగదీష్ వెంటనే అమ్మకానికి తీసుకువెళ్లిన పాత సామగ్రిని తిరిగి వెనక్కి తెప్పించి శివనాగరాజుపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. దీంతో శివనాగరాజుపై కేసు నమోదు కాకుండా పచ్చ తమ్ముళ్లు రంగంలోకి దిగారు. కేసు నమోదు కాకుండా పోలీసులు, పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిడి పెంచారు. సామాను తిరిగి రావడం, తెలుగు తమ్ముళ్ల ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించారన్న ప్రచారం సాగుతోంది. వాస్తవానికి రెండు లేక మూడు ట్రాక్టర్లలో పాత సామాను తీసుకువెళ్లాడని, కానీ తిరిగి తెచ్చింది కేవలం ఒక్క ట్రాక్టర్ సామానుమాత్రమేనని, కేసు నమోదు చేసి విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని వైఎస్సార్ సీపీ మద్దతు వార్డు మెంబర్లు కోరుతున్నారు. తెలుగు తమ్ముళ్లు పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు కాకుండా ఒత్తిడి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేసి పంచాయతీ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

టీఆర్ఆర్ కళాశాలను సందర్శించిన అడ్వైజర్స్


కళాశాలను పరిశీలిస్తున్న అడ్వైజర్లు

కందుకూరు రూరల్: కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో కళాశాలలో నిర్వహించిన అకడమిక్ బోధన అభ్యాసన, పరిశోధన, అవస్థాపన సౌకర్యాలు, విద్యార్థుల పురోగతి, పరిపాలన, హరితావరణం వంటి కార్యక్రమాలను అకాడమి అడ్వైజర్లు గురువారం పరిశీలించారు. కనిగిరి, ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన జయకుమారి, మాణిక్యరావులు కళాశాలలోని వివిధ విభాగాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కళాశాల పురోగతిని, అధ్యాపకుల గైడెన్స్, విద్యార్థుల సృజనాత్మకతను మెచ్చుకున్నారు. కళాశాల పరిశోధనా విభాగంలో మరింత పురోగతి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ అకడమిక్ అడ్వైజర్స్ సలహాలను పాటించి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన అందిస్తామన్నారు. అకాడమిక్ ఆడిట్ కోసం కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి


గేదెకు టీకాలు వేస్తున్న శ్రీధర్‌రావు

కందుకూరు రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పకుండా వేయించాలని కందుకూరు పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు జి.శ్రీధర్‌రావు సూచించారు. కందుకూరు మండలంలో జరుగుతున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేదెలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు టీకాలు వేయించి వ్యాధి రాకుండా చూసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పశువైద్య సహాయకుల ద్వారా టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి పికర్నో విరిడి అనే వైరస్‌తో వస్తుందన్నారు. నాలుగు నెలల దూడల నుంచి పెద్ద పశువులకు ముందస్తుగా టీకాలు వేయిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి ఎస్.సుధాకర్, గ్రామ పశువైద్య సహాయకులు ఎస్‌కే షాజహాన్ ఉన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయాలి


గాలికుంటు వ్యాధి టీకాలు పరిశీలిస్తున్న జేడీ డాక్టర్ బేబీరాణి

టంగుటూరు: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. మండలంలోని వల్లూరులో జరుగుతున్న గాలికుంటి వ్యాధి టాకాల కార్యక్రమాన్ని గురువారం జేడీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేడీ టీకాలు సక్రమంగా చేస్తునారో లేదో పర్యవేక్షించారు. అన్ని పశువులకు టీకాలు వేస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పశు బీమా పథకం ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన కల్పించి, వేసవిలో పశువులకు కావాల్సిన నీరు, మేత గురించి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. సూరారెడ్డిపాలెం పశువైద్యులు ధనలక్ష్మి, వల్లూరు ఏహెచ్ఏ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం


మాట్లాడుతున్న ఆత్మ డీపీడీ విజయ నిర్మల

కనిగిరిరూరల్: ప్రకృతి వ్యవసాయంతోనే మంచి ఆరోగ్యమని.. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో రైతు సేవా కేంద్రం, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాగస్వాములు కావాలని ఆత్మ డీపీడీ విజయనిర్మల అన్నారు. స్థానిక షాదీఖానాలో కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల రైతు సేవా సిబ్బంది, వ్యవసాయ సిబ్బందికి హోమ్ కంపోస్టింగ్, పోషక, కిచెన్, గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం ఏడీఏ వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఆర్‌సీ ఎస్ రామ్మోహన్ మాట్లాడుతూ కంపోస్టు పిట్లు తయారీ, మిద్దె తోటల పెంపకం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డీఆర్‌డీఏ సీడీపీ జి. వెంకట్రావ్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్సీ అధికారులు వి.వెంకట శేషమ్మ, ఏ శైలజరాణి, ఉద్యాన అధికారి ఎం అంజలిభాయి, ఏఓ జోత్స్నాదేవి, ఆరు మండలాల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో విద్యార్థులను చేర్పించండి


హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మోహన్

కనిగిరిరూరల్: ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులను మోడల్ స్కూల్‌లో చేర్పేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేయించి, పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని మోడల్‌స్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ అన్నారు. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, శివనగర్ కాలనీలోని పాఠశాలల్లో గురువారం ప్రచారం నిర్వహించి, హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు విన్నవించారు. మోడల్ స్కూల్‌లో ఉండే సౌలభ్యత, మౌలిక వసతులను గూర్చి వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్‌సేవ

పామూరు: మండల కేంద్రంలోని శ్రీవల్లీ సమేత భుజంగేశ్వరస్వామి ఆలయంలో స్వామి ఉత్సవమూర్తులకు గురువారం రాత్రి ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో ఊంజల్‌సేవ కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా ప్రత్యేకవేదిక, పీఠంపై వల్లీ, భుజంగేశ్వర ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు మహంకాళి శివప్రసాద్‌శర్మ వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉభయదాతలు ఆలయ మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు దంపతులు, బండ్లా నారాయణ, మాధవ, భక్తులు పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీఓకు వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

గుడ్లూరు: మండలంలోని పంచాయితీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓకు పని ఒత్తిడి తగ్గించాలని గురువారం వినతిపత్రం అందచేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీల్లేకుండా ఉంటుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కూడా సమయం ఉండటం లేదని పేర్కొన్నారు.

మాలకొండారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

పీసీపల్లి: మాలకొండారెడ్డి మృతి పార్టీకి తీరని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి అన్నారు. లక్ష్మక్కపల్లి గ్రామంలో మాలకొండారెడ్డి భౌతికకాయానికి గురువారం నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయన వెంట వీరం రెడ్డి బ్రహ్మరెడ్డి. ఫణీంద్ర, అమర్నాథ్ రెడ్డి, భూమ్ అంజిరెడ్డి, దత్తాత్రేయ రెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు


పరీక్షలు ముగియడంతో విద్యార్థుల సంతోషం

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఈ నెల 1 నుంచి జరుగుతున్న ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. పొన్నలూరు జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు మాలపాడు కేజీబీవీ విద్యాలయం విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 88 విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. ప్రశాంతమైన వాతవారణంలో పరీక్షలు ముగిసినట్లు చీఫ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు, డీఓ బి.రవీంద్ర తెలిపారు.

కొండపి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం 284 మందికి గాను 277 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో 2వ ర్యాంకు

టంగుటూరు: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చంద్రిక 51వ రాష్ట్ర మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో 2వ ర్యాంకు సాధించింది. గుంటూరులో ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో చంద్రికను మెడల్, మోమెంటోతో గురువారం ఘనంగా సత్కరించారు. చంద్రికకు గణిత ఉపాధ్యాయులు తోడుగా నిలిచిందని బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. భ్రమరాంబ తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా


మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరిరూరల్: ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేయడంలో రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈమేరకు అన్ని పార్టీల నాయకులతో సలహాలు, సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.